
క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



నందిగామ టౌన్: స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి అవసరమైన మరమ్మతులను తక్షణం నిర్వహిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాల కార్యాలయాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. కార్యాలయంపై కప్పు నుంచి నీరు కారుతుండటంతో విధులు నిర్వహించేందుకు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గతంలో ఆధునికీకరణ పనులు చేసిన కాంట్రాక్టర్‌ను పిలిపించి తక్షణమే మరమ్మతులు చేయాలని సూచించారు. మరొకసారి ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా పటిష్టంగా మరమ్మతులు చేయాలని స్పష్టంచేశారు. ఆర్డీఓ రవీంద్రరావు, తహసీల్దార్ నరసింహారావు, మునిసిపల్ ఏఈ ఫణి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాలభైరవుడికి ప్రత్యేక పూజలు



నందిగామ: స్థానిక రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని కాలభైరవుడి ఉపాలయంలో అష్టమి నేపథ్యంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రేపు మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

జగ్గయ్యపేట అర్బన్: మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 28వ తేదీన జరుగుతుందని మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు జరిగే సమావేశంలో పట్టణంలోని పలు అభివృద్ధి పనులు, పరిపాలనకు సంబంధించిన కేటాయింపులు తదితర 65 అంశాలతో కూడిన అజెండాను సభ్యుల ఆమోదం కోసం సిద్ధం చేశామని పేర్కొన్నారు. కౌన్సిల్ సభ్యులు, ఎక్స్–అఫిషియో సభ్యులు, అధికారులు హాజరు కావాలని సూచించారు.



లింగగూడెం వద్ద వరదలో పట్టిన చేపతో స్థానికులు



చెవిటికల్లు వద్ద పొంగుతున్న లక్ష్మయ్య వాగులోకి దిగుతున్న ట్రాక్టర్



చెన్నారావుపాలెంలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఏనుగు గడ్డ వాగు



జగ్గయ్యపేట మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న పాలేరు

పోటెత్తిన వాగులు

నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం కూడా భారీ వర్షం కురిసింది. ఈ వర్షాలకు వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. తెలంగాణ ప్రాంతంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మునేరు వరదతో పోటెత్తి ప్రవహిస్తోంది.

- కుండపోతగా కురుస్తున్న వర్షాలు
- ఉగ్రరూపం దాల్చిన మునేరు
- పలు గ్రామాలకు రాకపోకలు బంద్
- నీట మునిగిన పంట పొలాలు



పెనుగంచిప్రోలులో మునేరు కాజ్‌వే పక్కన సాయిబాబా గుడి, శివాలయాన్ని చుట్టుముట్టిన వరద

పెనుగంచిప్రోలు: వాయుగుండం ప్రభావంతో కుండపోతగా వర్షాలు పడుతున్నాయి. ముచ్చింతాల సమీపంలోని గండివాగు అనిగండ్లపాడు వద్ద కూచివాగు, దూళ్లవాగుకు బుధవారం వరద పోటెత్తడంతో రాకపోకలు నిలిచి పోయాయి. పంట పొలాలు నీట మునిగాయి. లింగగూడెం వద్ద గండివాగు ఉధృతంగా ప్రవహించటంతో పెనుగంచిప్రోలుకు–లింగగూడెం మధ్య రాకపోకలు స్తంభించాయి. పెనుగంచిప్రోలు వద్ద కాజ్‌వేను అనుకుని మునేరు ఉధృంతంగా ప్రవహిస్తోంది. తిరుపతమ్మ ఆలయం వద్ద పాకలు వరదలో కొట్టుకుపోయాయి. కేశఖండనశాల వద్ద వరద నీరు చేరింది. ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు వరద ఉధృతిని పరిశీలించారు. తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, డీటీ భాస్కరరావు, రెవెన్యూ సిబ్బందితో కలిసి మునేరు పక్కన నివశించేవారిని అప్రమత్తం చేశారు. ఎస్‌ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ వాగుల వద్ద ప్రత్యేకంగా బందోబస్తు నిర్వహిస్తున్నారు. లింగగూడెం వద్ద వాగులో, పక్కన పొలాల్లో చేపలు కోసం వర్షాన్ని లెక్క చేయక ప్రజలు గొడుగులు వేసుకుని వచ్చారు. ముండ్లపాడు వద్ద వాగులో తూటుకాడ, కంపను సర్పంచ్ గూడపాటి లావణ్య, మాజీ ఎంపీపీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జేసీబీ ఏర్పాటు చేసి తొలగించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జగ్గయ్యపేట సీఐ జానకిరామ్, పెనుగంచిప్రోలు ఎస్‌ఐ సీహెచ్ కె.దుర్గాప్రసాద్‌తో కలిసి నందిగామ ఏసీపీ జనార్దననాయుడు బుధవారం మునేరును పరిశీలించి కాజ్‌వే గోడల వద్ద ఇరుక్కున్న చెట్లు, కొమ్మలను జేసీబీతో తీయించారు. సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, వేల్పుల రవికుమార్, కొత్తపల్లి పెంటయ్య, సొసైటీ అధ్యక్షులు పిడికిటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



దాములూరు కూడలి వద్ద పోలీస్ బీట్



కీసర వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరు

మునేటికి పోటెత్తిన వరద

వత్సవాయి: మునేటికి వరద పోటెత్తింది. పోలంపల్లి డ్యాం వద్ద 13.1 అడుగుల మేర వరద ప్రవహిస్తోంది. తెలంగాణలోని వరంగల్, ఖమ్మం జిల్లాల్లో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరద పోటెత్తి మునేటికి చేరింది. బుధవారం 56.720 క్యూసెక్కుల వరద ప్రవాహం నమోదైందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. లింగాల వద్ద కాజ్‌వేపై నుంచి వరద ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలను నిలిపివేశారు. తహసీల్దార్ వైకుంఠరావు, ఎస్‌ఐ బి.అభిమన్యు ఆధ్వర్యంలో కాజ్‌వేకు రెండు వైపులా బందోబస్తు ఏర్పాటు చేశారు. వరదను తిలకించేందుకు ప్రజలు లింగాల కాజ్‌వే వద్దకు తరలివస్తున్నారు. వర్షాలకు పత్తి పంట ఎర్రబారుతుందని రైతులు వాపోతున్నారు.

కంచికచర్లలో 77.4 మి.మీ. వర్షపాతం

కంచికచర్ల: మండలంలో 77.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింధైంది. చెవిటికల్లు లక్ష్మయ్యవాగు, కంచికచర్ల సమీపంలో నల్లవాగు పొంగిపొర్లుతున్నాయి. మోగులూరు వెళ్లే వాగు పొంగటంతో రాకపోకలు స్తంభించాయి. గొట్టుముక్కలలో ఏనుగు గడ్డ వాగు పోటెత్తింది. పత్తి, పెసర, మొక్కజొన్న చేలల్లో వర్షపు నీరు చేరింది. పేరకలపాడు, కీసర మున్నేటి సమీపంలో పొలాలన్నీ జలమయమయ్యాయి. గండేపల్లిలో పత్తి చేలల్లో వర్షపునీరు నిలిచింది. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను తహసీల్దార్ శంకరబాబు, డీటీ నాగులమీరా పరిశీలించారు. ఎస్‌ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం పోలీస్ సిబ్బందిని కాపలా ఉంచారు. చెవిటికల్లు వద్ద కృష్ణానదికి వరద పోటెత్తి ప్రవహిస్తోంది.

మున్నేరుకు జలకళ

మండలంలోని కీసర వద్ద మున్నేటికి 77 వేల క్యూసెక్కుల వరదనీరు చేరిందని సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. మంగళవారం 82 వేల క్యూసెక్కుల నీరు వచ్చినా, ప్రస్తుతం వరద తగ్గుముఖం పట్టిందన్నారు. పరీవాహక ప్రాంతాల ప్రజలు సురక్షితంగా ఉండాలని తహసీల్దార్ పబ్బారి శంకరబాబు సూచించారు. మున్నేరు, వైరా ఉపనదులున్న గ్రామాల్లో వీఆర్వోలను అప్రమత్తం చేశారు.

కూడలి వద్ద నిలిచిన రాకపోకలు

నందిగామ: నందిగామ డివిజన్ పరిధిలో భారీ వర్షం కురుస్తోంది. అధికారుల లెక్కల ప్రకారం డివిజన్‌లో రెండు రోజుల్లో 733 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు మున్నేరు, వైరా, కట్టలేరుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ నేపథ్యంలో నందిగామ మండలం దాములూరు కూడలి వద్ద వైరా నదిపై గల కాజ్ వే పై వరద నీరు ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో ఆ మార్గంలో నందిగామ, వీరులపాడు మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. దాములూరి కూడలి వద్ద ప్రత్యేక పోలీస్ బీట్ ఏర్పాటు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ హనీష్ తెలిపారు.

భారీ వర్షాలకు మండలంలోని పలు చోట్ల పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి.

ఉధృతంగా ప్రవహిస్తున్న పాలేరు

జగ్గయ్యపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పాటు ఎగువ నుంచి వస్తున్న వరదతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మండలంలోని పాలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు.

కట్టలేరు ఉగ్రరూపం

వీరులపాడు: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎగువ నుంచి వస్తున్న భారీ వరదతో కట్టలేరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. మండలంలోని చెన్నారావుపాలెం గ్రామ సమీపంలోని ఏనుగు గడ్డ వాగు సైతం ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంత సమీపంలోని పల్లపు ప్రాంత పంట పొలాలు నీట మునిగాయి. పల్లెంపల్లి గ్రామ సమీపంలోని కట్టలేరుతో పాటు ఉప నదులను తహసీల్దార్ ఆశయ్య నాయక్, ఎస్‌ఐ మహాలక్ష్మణుడు బుధవారం పరిశీలించి రాకపోకలను నిలిపివేశారు.

దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం



పనులను పర్యవేక్షిస్తున్న జుబేర్

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 22వ వార్డు, నాగమయ్య బజారు ప్రాంతంలో దీర్ఘ కాలికంగా ఉన్న పారిశుద్ధ్య సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్ వెనుక ఖాళీ స్థలంలో సుమారు 600 గృహాల నుంచి మురుగు నీరు చేరుతోంది. ఆ ప్రాంతం మురుగు తటాకంలా ఏర్పడి దోమల ఉత్పత్తి కేంద్రంగా మారింది. స్థానికులు దోమకాటుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ఆ ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు స్థానికులు ఈ సమస్యను వివరించారు. ఎమ్మెల్యే స్పందించి రూ.1.5 లక్షలతో ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసే పనులను మంజూరు చేయించారు. ఈ నిధులతో చేపట్టిన పనులను జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రధాన కార్యదర్శి షేక్ జుబేర్ బుధవారం పర్యవేక్షించారు. సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే ఉదయభానుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

3న పేట నియోజకవర్గ సమీక్ష సమావేశం

జగ్గయ్యపేట: ఆగస్టు మూడో తేదీన జగ్గయ్యపేట నియోజకవర్గ సమీక్ష సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ ప్రసాద్ బుధవారం తెలిపారు. పట్టణంలోని మునిసిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆ రోజు ఉదయం పది గంటలకు నియోజకవర్గ స్థాయి సమీక్ష పమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి తానేటి వనిత, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పాల్గొంటారని వెల్లడించారు. జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి వివరాలను ఈ నెల 28న చిల్లకల్లు ఎంపీడీఓ కార్యాలయంలో అందించాలని ఆదేశించారు. ఆ సమావేశంలో అన్ని శాఖల అధికారులు విధిగా పాల్గొనాలని సూచించారు.

విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలి

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని ఎంఈఓ చిట్టిబాబు సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చిల్లకల్లు స్కూల్ కాంప్లెక్స్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. డ్రాప్ అవుట్స్, సిస్టమ్ డ్రాప్ అవుట్స్ లేకుండా విద్యార్థలను పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఇంగ్లిష్ ప్రాధాన్యతను గుర్తించి బోధనా నైపుణ్యాలను మెరుగుపరచాలన్నారు. గ్రామంలోని మెయిన్ పాఠశాలలో మూడో తరగతి విద్యార్థులకు పార్ట్స్ ఆఫ్ ప్లాంట్‌పై అవగాహన కలిగించారు. కాంప్లెక్స్ ఇన్‌చార్జ్‌లు కోటేశ్వరరావు, రిసోర్స్ పర్సన్ రమేష్, కొండయ్య చారి, లక్ష్మణరావు, సీఆర్పీలు పాల్గొన్నారు.

బడి బయట పిల్లలపై దృష్టి పెట్టాలి

నందిగామ: బడి బయట పిల్లల నమోదు విషయంలో ప్రతి ఉపాధ్యాయుడు అప్రమత్తంగా ఉండాలని ఎంఈఓ ఎం.పద్మావతి సూచించారు. మండలంలోని లింగాలపాడు, అనాసాగరం, ఐతవరం, నందిగామ కాంప్లెక్స్‌ల పరిధిలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో బుధవారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు ప్రతి ఒక్కరూ పాఠశాలకు వచ్చేలా చూడాల్సిన బాధ్యత ఆయా గ్రామాల ఉపాధ్యాయులదేనని అన్నారు. నాడు– నేడు కార్యక్రమాలు వేగవంతమయ్యేలా చూడాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక బోధన చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ చైర్మన్ విజయలక్ష్మి, రిసోర్స్ పర్సన్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలి

పెనుగంచిప్రోలు: ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని ఎంఈఓ డి.రవీంద్ర సూచించారు. స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో ప్రాథమిక స్థాయి, ప్రాథమికోన్నత స్థాయి స్కూల్ కాంప్లెక్స్ (సోషల్ సబ్జెక్టుపై) సమావేశం బుధవారం జరిగింది. ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఉన్న సామర్థ్యాలను గుర్తించి అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు. హెచ్‌ఎం కె.జలజ, రిసోర్స్ పర్సన్లు పాము నాగేశ్వరరావు, శెట్టిపోగు రాము, మర్రి ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీఓ

నందిగామ: ఉప నదులకు భారీగా వరద నీరు వచ్చి చేరుతున్న నేపథ్యంలో పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ రవీంద్రరావు సూచించారు. తుపాను నేపథ్యంలో స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నందిగామ డివిజన్ పరిధిలో కొద్ది రోజులుగా భారీ వర్షాలు పడుతున్నాయని, ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణా నది, వైరా, మున్నేరు, కట్టలేరు ఉప నదులకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోందని పేర్కొన్నారు. ఈ తరుణంలో పరీవాహక ప్రాంత గ్రామాల ప్రజలు నీటిలో దిగవద్దని సూచించారు. అన్ని శాఖల అధికారులను కూడా అప్రమత్తం చేసినట్లు తెలిపారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పెనుగంచిప్రోలు: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి సూచించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో నందిగామ ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యాధికారి డి.దుర్గామల్లేశ్వరరావు, అనిగండ్లపాడు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారి వై.ప్రియదర్శిని బుధవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి శ్యాంబాబు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, తదితరులు పాల్గొన్నారు.